## మన(సు)లో మాట

సంఘమిత్ర పాఠక మహాశయులందరికీ ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు మరియు సంక్రాంతి శుభాకాంక్షలు. రానున్న రిపబ్లిక్ దినోత్సవము సందర్భముగా శుభాకాంక్షలు. గత సంచిక పలువురికి నచ్చినందులకు సంతోషం. మా ప్రయత్నానికి అడుగడుగునా చేయూతనిస్తూ, ప్రోత్సాహాన్నందిస్తున్న డాక్టర్ వేమూరి వేంకట రామనాధం గారికి, దేవాలయ అర్చకులు శ్రీ శ్రీనివాస్ గారికి, ఓగిరాల కృష్ణారావు గారికి, కుటుంబ సభ్యులకు, మిత్రులకు, ప్రతి సంచికను చదివి - అమూల్యమైన సలహాలను అందిస్తున్న పాఠకులకు ధన్యవాదములు. ఈ సంచికలో 'చరిత్రకెక్కిన చరితార్థులు' శీర్షికలో 'విశ్వకవి వేమన' వ్యాసాన్ని అందించిన శ్రీ దూర్వాసుల వేంకట సుబ్బారావు గారికి, సంఘమిత్రలో ప్రచురించడానికి అనుమతించిన శ్రీ వంగూరి చిట్టెన్‌రాజుగారికి కూడా మా ప్రత్యేక ధన్యవాదములు. 'తెలుగు ఒన్' ఆధారముగా ముఖచిత్రం రూపొందించడం జరిగింది. మల్లిక్ గారికి ధన్యవాదములు.

"తండ్రి విద్యావంతుడైతే అతడే ప్రయోజనం పొందుతాడు. తల్లి విద్యావంతురాలైతే కుటుంబమంతా ప్రయోజనం పొందుతుంది" అనేది మన పెద్దవాళ్ళ వాక్కు. ఇక్కడ విద్య అంటే ఎం.ఏలు, పి.హెచ్.డిలు ఎంతమాత్రమూ కాదు. నీతి - నియమాలు, సంస్కృతి - సంప్రదాయములు, పండుగలు - వాటి విశేషాలు, మన ముందు తరాల వారు మనకు అందించిన అతి విలువైన ఆస్తి 'నీతి పద్యాలు', 'శతక పద్యాలు', 'పురాణగాధలు', 'పంచతంత్ర కథలు' వంటివి. వాటిని మన తరువాత తరాలకు అందించడం మన కర్తవ్యం. కావున వీటిని మన పిల్లలకు, మనుమలకు నేర్పే బాధ్యతని స్వీకరిద్దామా! వారానికో పద్యము చొప్పున నేర్పినా సంవత్సరానికి అర్థశత(క)ము పూర్తవుతుంది. ఇది మా హృదయ పూర్వక విన్నపము.

వేమన జయంతి సందర్భముగా 'విశ్వకవి వేమన', గణతంత్ర దినోత్సవ సందర్భముగా పిల్లలకు 'దేశమును ప్రేమించుమన్నా' అనే గీతాన్ని, సంక్రాంతిని గుర్తు చేసుకుంటూ 'సంక్రాంతి సంబరాలు' మీకు అందించడం జరిగింది. పిల్లలకు Crossword, Can you find the word? వంటి క్రొత్త అంశాలను చేర్చడం జరిగింది. ఇక 'చెప్పుకోండి చూద్దాం!' మీ సౌకర్యం కోసం మొదటిసారిగా English లో అందిస్తున్నాం. త్వరలో మరికొన్ని క్రొత్త శీర్షికలు మీకు అందించే ప్రయత్నం చేస్తున్నాం. అనివార్య కారణముల వలన ఈ సంచికలో 'మీకు తెలుసా?' అందించలేక పోతున్నాం.

ఈసారి 'పదచదరంగం', 'పొడుపు కథలు', 'సమస్యలతోరణం', 'చెప్పుకోండి చూద్దాం!' శీర్షికలకు సమాధానములు పంపిన పాఠకులకు అభినందనలు. ఈసారి కూడా అదే స్పందన లభిస్తుందని ఆశిస్తాము. మళ్ళీ ఉగాది సంచికలో కలుద్దాం! సెలవా మరి.

సంఘమిత్ర సంపాదక వర్గం